క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వాకలపూడి వైఎస్సార్ సీపీ నాయకులు నల్ల రాణి, శ్రీనుల ఆధ్వర్యంలో శ్రీనివాస రజక సంఘ అధ్యక్షుడు బందారి బాబూరావు, కె.సత్యనారాయణ, సామకుర్తి రామకృష్ణ తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించి పార్టీ విజయానికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శిబిరంలో భాగంగా శనివారం రహదారులను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 అధికారి డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో వలంటీర్లు గ్రామంలో నిర్మించనున్న రహదారుల వద్ద చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

కరప: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కె.శ్రీనివాస్ కోరారు. శనివారం మండలం గొర్రిపూడి, అరట్లకట్ట, కరప గ్రామాల్లో కేంద్ర పోలీస్ దళాలు, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు భద్రత, భరోసా కల్పిస్తామన్నారు. దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, ఏఎస్ఐ వి.సూరిబాబు, జి.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న డ్రైఫ్రూట్ శివలింగాలు

బోట్‌క్లబ్: వివిధ రకాల పప్పు దినుసులు, డ్రైఫ్రూట్స్, సిరి ధాన్యాలతో తయారుచేసిన శివలింగాల దివ్య దర్శనం కాకినాడ నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక 50 బిల్డింగ్ సెంటర్‌లోని బ్రహ్మకుమారీస్ రాజయోగ సెంటర్‌లో మహాశివరాత్రి సందర్భంగా 88 రకాల శివలింగాల దివ్య దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ఈ దర్శనం ఈ నెల 10వ తేదీ రాత్రి 8 గంటలు వరకూ ఉంటుందన్నారు.

టీడీపీ, జనసేనలను నమ్మొద్దు

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- మూడు ప్రాంతాల్లో మహిళలకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



కాకినాడలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అధికారం కోసం ప్రజలను మభ్య పెట్టేందుకు మరోసారి జనంలోకి వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీలను నమ్మొద్దని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక ఫౌండేషన్ హాస్పిటల్, గాంధీ పార్క్, శారదా దేవి ఆలయ ప్రాంతాల్లో శనివారం ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, మాజీ మేయర్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల అభివృద్ధి, గృహ నిర్మాణాలకు సంబంధించి సాధించిన ప్రగతిని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ మూడు పార్టీలు గతంలో కూడా ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేసిన ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకాన్ని కూడా అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. నాయకులు అంటే ఎలా ఉండాలో ఎన్టీఆర్, వైఎస్సార్, జగన్ వంటి నేతలను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ఎన్టీఆర్ కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని, మహానేత వైయస్సార్ ఆరోగ్యశ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్, సీఎం జగన్ అమ్మఒడి, వైయస్సార్ ఆసరా, చేయూత, నవరత్న పథకాలతో ప్రజల్లో గుర్తింపు సంపాదించుకున్నారన్నారు.

అయితే సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసి తనకంటూ ఒక్కటంటే ఒక్క పథకాన్ని కూడా అమలు చేయని ఏకైక వ్యక్తి చంద్రబాబు అన్నారు. సమాజంలో మహిళకు మరింత గౌరవాన్ని పెంచేలా అన్ని ప్రభుత్వ పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా ఎంపిక చేయడం, రాజకీయంగా ఉన్నత పదవుల్లో నియమించడం సహా ఎన్నో మహిళాభివృద్ధి కార్యక్రమాలను సీఎం చేపట్టారన్నారు. ప్రధానంగా సుమారు 35 వేల రూపాయల ఖర్చయ్యే ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా ఉచితంగా పత్రాలు ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో సదరు స్థలాన్ని బ్యాంకుల్లో తనఖా పెట్టుకోవడం, అవసరమైతే బదలాయించుకోవడం సహా సర్వహక్కులూ లభిస్తాయన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఒక్క శనివారం కాకినాడలోని 12 డివిజన్లకు సంబంధించి 6693 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఆయా రిజిస్ట్రేషన్ పేపర్లను స్థానిక సచివాలయాలకు వెళ్లి తీసుకోవచ్చునని సూచించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థల లబ్ధిదారుల తరఫున ఆయా డివిజన్లకు చెందిన నాయకులు ఎమ్మెల్యే ద్వారంపూడిని ఘనంగా సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి పలువురు మాజీ కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన అవసరం

- మాస్టర్ ట్రైనర్లతో పీవో, ఏపీఓలకు అవగాహన
- 528 మంది సిబ్బంది హాజరు
- పర్యవేక్షించిన ఆర్ఓ వెంకటరావు



కాకినాడలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ఈవీఎంలను ఎలా వినియోగించాలి? వీవీ ప్యాట్ ద్వారా ఎవరికి ఓటు వేసారో ఓటరు ఎలా తెలుసుకోవాలి? వీటి పనితీరు ఎలా ఉంటుంది? అవి సమర్థవంతంగా పనిచేసేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలపై ఎన్నికల విధుల్లోని సిబ్బందికి శనివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈ శిక్షణ జరిగింది. ఎన్నికల విధుల్లో ఉన్న దాదాపు 528 మంది పీఓలు, ఏపీవోలు ఈ శిక్షణకు హాజరయ్యారు. సిటీ నియోజకవర్గ ఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఈ శిక్షణను పర్యవేక్షించారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని 22 సెక్టార్ల పరిధిలో ఈ శిక్షణ నిర్వహించారు. అసెట్ లయబిలిటీ మేనేజ్‌మెంట్ అండ్ ట్రెజరీ (ఏఎల్ఎంటీ), సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో ఈ మొదటి విడత శిక్షణ ఏర్పాటు చేశారు. మాక్ పోల్ ఎలా నిర్వహించాలి? పోలింగ్‌కు ముందు, పోలింగ్ జరిగే రోజు చేపట్టే విధులపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఓ జె.వెంకటరావు మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై ఎన్నికల సిబ్బంది సంపూర్ణ అవగాహన కల్పించుకోవాలని సూచించారు. శిక్షణలో ఇచ్చిన తర్ఫీదు ఆధారంగా రానున్న ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరగడంలో ఎన్నికల సిబ్బంది పాత్ర అత్యంత ప్రధానమన్నారు. శిక్షణ జరుగుతున్న సమయంలో ఆర్వో జె. వెంకటరావు స్వయంగా పర్యవేక్షించి, సిబ్బంది ఏ మేరకు అవగాహన చేసుకున్నారో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ దొర, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు, దీపక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

‘సత్యవాణి’ సేవలు అభినందనీయం

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- సంస్థ నిర్వాహకులు జాషువా గూటంకు ఘన సత్కారం



జాషువా గూటం దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ కేంద్రంగా సత్యవాణి చర్చి, సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. శనివారం కాకినాడ నగరంలోని సత్యవాణి చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆవరణలో సంఘ నిర్వాహకులు జాషువా గూటం క్రీస్తులోకి వచ్చి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిక్కిగూటం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఈ 60 ఏళ్ల దేవుని పరిచర్యలో టీవీ, రేడియో ద్వారా పరిచర్య చేస్తూ 25 వేల చర్చిలను నిర్మించి, 50 లక్షల పైగా బైబిల్ పాఠాలు ఏపీ, తెలంగాణ లలో సత్యవాణి ద్వారా సేవలు అందించడం కాకినాడకే గర్వకారణం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రైస్తవులకు అండగా ఉన్న ప్రభుత్వం అని, తిరిగి వైఎస్ జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తనను కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చేలా ప్రార్థనలు చేయాలన్నారు. నగరంలో క్రైస్తవులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాలు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ఈ సందర్భంగా జాషువాగూటం దంపతులను ఎమ్మెల్యే ద్వారంపూడి సత్కరించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, క్రీస్తు సంఘ నాయకులు నెహెమ్యాగూటం, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాగరణతో తరించిన భక్తులు

కాకినాడ రూరల్: మహాశివరాత్రి సందర్భంగా ఉపవాసంతో ఉన్న భక్తులు రాత్రి శివాలయాల వద్దకు చేరుకుని జాగరణ చేశారు. లింగోద్భవ పుణ్య కాలంలో మహాశివునికి చేసిన అభిషేకాలను తిలకించి తరించారు. మండలంలోని శివాలయాల్లో శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అభిషేకాలు నిర్వహించారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని పార్వతీ సమేత త్ర్యంబకేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన నందిబాబు, రాజబాబు, వేణు, లక్ష్మణరావు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై అభిషేకాలను ప్రదర్శించారు. సినీ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. శ్రీపీఠం, సర్పవరం నీలకంఠేశ్వరస్వామి ఆలయాలలో శనివారం అన్నాభిషేకాలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు.



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో మహా శివరాత్రి వేడుకల్లో కురసాల కల్యాణ్‌కృష్ణ తదితరులు

సొంతింటి సాకారమే సీఎం ధ్యేయం



ఉప్పలంకలో లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్టర్డ్ దస్తావేజులు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- లబ్ధిదారులకు ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



తోలుబొమ్మలాట కళాకారుల సంక్షేమసంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ఇల్లు కట్టుకోవడమనేది ప్రతి ఒక్కరికీ మధురమైన ఘట్టమని, దానిని సాకారం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల స్థలాల పట్టాలను అందజేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం ఉప్పలంకలో శనివారం సర్పంచ్ బొమ్మిడి నయోమి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ పరిధిలో 32 వేల మందికి ఇళ్ల స్థలాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఇచ్చినట్టు తెలిపారు. ఉప్పలంకలో 352 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో కాపురం, ఏపీలో పెత్తనం చేయడానికి వస్తున్న ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మవద్దన్నారు. పేదల పక్షాన నిలబడి, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్నను ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించే బాధ్యత మీదైతే, తలవంచి పనిచేసే బాధ్యత మాదని కన్నబాబు పేర్కొన్నారు. తర్వాత నడకుదురులో రూ.35 లక్షలతో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనానికి, కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలో రూ.18 లక్షలతో నిర్మించిన తోలుబొమ్మలాట కళాకారుల సంక్షేమ సంఘం భవనానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, మాజీసర్పంచ్ బొమ్మిడి శ్రీను, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ఎస్.సూర్యప్రకాష్, ఏడీ డాక్టర్ ఎస్‌జే సురేష్ బాబు, డాక్టర్ ఎన్.రవికిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రచనలు చైతన్యం తీసుకురావాలి



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు తన రచనలను అందిస్తున్న పుప్పాల సూర్యకుమారి

బోట్‌క్లబ్: మనం రాసే రచనలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చేలా ఉండాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. అఖిల భారత తెలుగు సాహితీ సదస్సులో పాల్గొనేందుకు కాకినాడ వచ్చిన ఆయన స్థానిక బీజేపీ నాయకుడు పైడా కృష్ణమోహన్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత పుప్పాల సూర్యకుమారి ఆయనను కలిసి తాను రాసిన రచనలను అందించారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

కరప: మండలం పెనుగుదురులో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్టు సర్పంచ్ రెడ్డిపల్లి వెంకట మాధవి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దీనిని ప్రారంభిస్తారని, ఈ భవన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేశారని, మూడో అంతస్తుకు కురసాల కన్నబాబు సమావేశ మందిరంగా నామకరణం చేసినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట గ్రామ కార్యదర్శి బి.చంద్రకళ, రెడ్డిపల్లి రమేష్ తెలిపారు.